# గోదారమ్మ-6

'నిజమే, అతనికేం శిక్ష పడినా, చంపబడిన అక్క తిరిగి బ్రతికే అవకాశం లేదు! అందుకని... ఒక హంతకుడిని కాపాడటం వలన ఏం ప్రయోజనం ఉంటుందీ...? నేరం చేసిన వాడికి శిక్ష పడనక్కరలేదా?'

నా చూపుల్లోని ప్రశ్నలకు జవాబు చెప్పలేనివాళ్ళల్లా అమ్మా నాన్నలు తలలు వాల్చేసారు!

అవును... వాళ్ళ నిస్సహాయత వాళ్ళది!

చంటి పిల్లాడి బాధ్యత ఏమిటనేది వాళ్ళకి ప్రశ్నార్థకంగా మారింది.

అందుకని నేనతన్ని పెళ్ళి చేసుకుంటే ఆ సమస్య తీరుతుందనేది వాళ్ళ అభిప్రాయమని నాకర్థం అయింది!

నా అభ్యంతరాలు, ఆలోచనలూ వాళ్ళకి చెప్పటం వలన ఏం ఉపయోగం లేదని నాకు తెలిసిపోయింది! అందుకే మౌనంగా ఉండిపోయాను. నేను చేయాల్సింది చేయటమే అని మనసులోనే నిర్ణయించుకున్నా.

అక్కకీ ఇలా జరుగుతుందని తెలియకపోయినా, అనారోగ్యంతో చనిపోతానని ముందే ఊహించిందేమో, అందుకే కాబోలు పిల్లాడి బాధ్యత నాదేనన్నట్లుగా మాట్లాడేది.... నేను అపుడు తెలుసుకోలేకపోయాను!

కోర్టులో... అమ్మవాళ్ళు 'తాము ఏమీ చూడలేదని, అక్క చనిపోయాక మాత్రమే చూశామని, కత్తిపీటతో కంఠం నరుక్కుని ఆత్మహత్య చేసుకోవటం నిజమే అయివుండొచ్చనీ' సాక్ష్యం చెప్పారు!

కానీ నేను మాత్రం నిజమే చెప్పాను!

నా సాక్ష్యానికి అమ్మవాళ్ళు అవాక్కయారు! నేనలా చెబుతానని ఊహించివుండలేదేమో, దిగ్భ్రాంతి చెందారు... మరి వాళ్ళు చెప్పిన మాటలన్నీ నేను విని మౌనంగా ఉండటం వలన... నేనూ మెత్తబడ్డాననే అభిప్రాయం కలిగి ఉంటుంది.

నేను చూసిందంతా కళ్ళకు కట్టినట్లుగా కోర్టులో వివరంగా చెప్పాను!

దాంతో అతనికి మరణశిక్ష విధించబడింది!

నేను అమ్మా వాళ్ళతో స్థిరంగా నా అభిప్రాయం చెప్పాను. ‘వీడు అక్కకొడుకు కాదు… నా పిల్లాడే! నా ప్రాణం, అలాగే పెంచుతాను!’ అని. దానికి మా వాళ్ళు అభ్యంతరం చెప్పారు. ‘అదెలా వీలవుతుందీ? నువ్వు పెళ్ళి చేసుకుని వేరే చోటకి వెళ్ళాల్సిన దానివి…. పిల్లాడిని పెంచే బాధ్యత మాదే! మేం ఉన్నంతకాలం వాడికేం ఫర్వాలేదు లే…!’ అన్నారు.

నేను వినలేదు… ‘వాడి బాధ్యతనూ స్వీకరించగలిగే వాళ్ళనే నేను పెళ్ళి చేసుకుంటాను! అభ్యంతరం ఉన్నవాళ్ళ ప్రసక్తి మనకనవసరం! అక్క నాకు చివరగా అప్పచెప్పిన బాధ్యత! దీనిని సక్రమంగా, ఇష్టంగా, నిర్వర్తించటమే నా జీవితధ్యేయం!’ అని నిక్కచ్చిగా చెప్పేశాను. మావాళ్ళూ అంగీకరించక తప్పలేదు. తర్వాత…

నా హైస్కూలు చదువు పూర్తవటంతో పెళ్ళి ప్రయత్నాలు మొదలుపెట్టారు. రెండు మూడు పెళ్ళి చూపులు జరిగాయి. నేను పిల్లాడిని ఒళ్ళో పెట్టుకునే వాళ్ల ముందు కూర్చున్నాను. చెప్పటం వరకూ సరేగానీ, అలా చేయటం ఎందుకూ అని అమ్మానాన్నలు అభ్యంతరం చెప్పినా నేను వినలేదు.

చివరకు అనుకున్నట్లే జరిగింది… కొన్ని సంబంధాలు పెళ్ళి చూపుల తర్వాత తప్పిపోతే, ఆ తర్వాత మరికొన్ని సంబంధాలు పిల్లవాడి బాధ్యత గురించి విని పెళ్ళి చూపులకు రాకుండానే తిరస్కరించటం జరిగింది.

దాంతో నాకూ విరక్తి కలిగింది.

ఇక పెళ్ళి ప్రసక్తి వద్దేవద్దని ఖచ్చితంగా చెప్పేసాను. మా వాళ్ళు ఎంత గోల పెట్టినా ఖాతరు చేయలేదు.

నా ప్రయత్నాలు ఫలించి ఇక్కడ ఎలిమెంటరీ స్కూలు టీచరుగా చిన్న ఉద్యోగం వచ్చింది. నన్ను అంత దూరం వెళ్ళకుండా అడ్డుకోవటానికి అమ్మా వాళ్ళు చేసిన ప్రయత్నాలను లెక్క చేయకుండా చాలా దూరమైనా ఇక్కడకు వచ్చేసాను!

మా అమ్మకు ఇది సుతరామా ఇష్టంలేదు. బతిమాలింది… కోప్పడింది… అలిగింది… ఆఖరి అస్త్రంగా మాట్లాడనని శపథమూ చేసింది!

నా అభిప్రాయానికి తిరుగులేదని అర్థం చేసుకున్న నాన్న నాతో పాటు వచ్చారిక్కడకు. నాకు కట్నంగా ఇద్దామని దాచిపెట్టిన డబ్బుతో ఈ చిన్న ఇల్లును కొన్నారు. దానికి నేనేం అభ్యంతరం చెప్పలేదు... మంచిదే అనుకున్నా.

నేను ఒక్కదాన్నీ ఉంటూ రంగాను పెంచటమే నా లక్ష్యంగా మార్చుకున్నాను!

వాడికి మాత్రం తన అమ్మా నాన్నా లేరనే విషయం తెలియనివ్వకూడదని అనుకున్నా. అందుకే... ఇక్కడ వాళ్ళకి వాడు నా కొడుకే నని చెప్పా. తండ్రి గురించి అడిగిన వాళ్ళకి లేడని, యాక్సిడెంట్ లో చనిపోయాడని చిన్న కట్టు కథ చెప్పాను...! అందరూ తేలికగానే నమ్మారు. రంగాకీ అదే విషయం తెలిసి నన్నెపుడూ తండ్రి గురించి రెట్టించలేదు.

చాలా రోజుల తర్వాత నేను ఊరుకు వెళ్ళినపుడు... మా అమ్మ తన అలకని వదిలేసి, అలా ఎందుకు చేసావని నిలదీసింది. 'పెళ్ళి చేసుకునే అభిప్రాయం లేనపుడు... వాడు నా పిల్లాడేనని చెప్పటంలో తప్పేముందీ' అని అనిపించిందని చెప్పాను. అదే నా నిర్ణయమనీ గట్టిగా హెచ్చరించాను!

ఇక్కడకు వచ్చిన కొత్తలో... నాకు పదే పదే అక్క గుర్తుకు వచ్చేది. తన ఆలోచనలతో చాలా అలజడిగా ఉండేది!

పెళ్ళికి ముందు... అక్కది ఎంత చక్కని చిరునవ్వు... ఒద్దికగా నిండు గోదారిలా ఉంటుందని మా అమ్మ పదే పదే అనుకుంటూ మురిసిపోయేది!

ఒకసారి మాటల సందర్భంలో నేను బావతో ఈ మాట చెప్పాను. అపుడు అతను ఏమన్నాడంటే... 'నాకలాంటి ప్రశాంతత అంతగా నచ్చదు... నీలా దుమికే జలపాతంలా హుషారుగా, అల్లరిగా ఉండే వాళ్ళంటేనే చాలా ఇష్టం...' అని నిస్సిగ్గుగా చెప్పాడు.

అక్క భర్తగా నాకు విశాల్రావంటే ఇష్టమూ, గౌరవమూ ఉన్నాయి. అందుకే... నెమ్మదిగా అన్నాను ''బావా... జలపాతానికి దగ్గరగా వెళ్తే ఆ హోరూ, జోరూ అంతగా నచ్చకపోవచ్చు. దూరంగా చూసినపుడు కలిగేంత ఉత్సాహం, ఇష్టం ఏర్పడకపోవచ్చు. అయినా మన చెంతనున్నదాన్నే ఇష్టపడటం చేయగలిగితే, జీవితం ప్రశాంతంగా ఆనందంగా గడిచిపోతుంది కదా....? అక్కలాంటి అమ్మాయి భార్యగా లభించటం అంటే... ఎంతో అదృష్టమని నా నమ్మకం!'

అప్పటికి అలా ఏదో నాకు తోచింది చెప్పాను.

బావ నిట్టూర్చాడు. 'నీ మాటల్లో మీ అక్కపట్ల ఉన్న నీ ఇష్టం కనబడుతోంది తప్ప... నాకు నచ్చినట్లుగా లేదు నీ సమాధానం!'

బావ మాటల్లోని అర్థం ఏమిటో నాకప్పుడు అంతగా తెలియలేదు. ఏమై ఉంటుందా అని ఆలోచించలేదు కూడా.

అక్క హత్య తర్వాత... అతను నాతో ఏమన్నాడో తెలుసునా...? 'నీ మీదనున్న ఇష్టం, ప్రేమతోనే నేనిదంతా చేసాను... అర్థం చేసుకో... నాకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పటం వలన నీకు ఒనగూడే లాభం ఏమీ లేదు. అయినా నువ్వే చూసావుగా, మీ అక్క కత్తిపీట తెచ్చి నామీదకు ఎగబడింది. అంటే ఆత్మరక్షణార్థమేగా నేను తనని చంపాల్సివచ్చిందీ...? మీ అక్క ఎలాగూ పైలోకానికి వెళ్ళిపోయింది. ఇక్కడ ఉన్న మనిద్దరం పిల్లాడిని చూసుకుంటూ బ్రతుకుదాం... నీకు పెళ్ళి సమస్యా, నాకు శిక్షా తప్పుతాయి... ఆలోచించు!'

నాకెంతో ఇష్టమైన అక్క మరణాన్ని మర్చిపోయి... ఈ హంతకుడితో కాపురం చేయటమా...?! అంతకన్నా దారుణం మరొకటి ఉంటుందా...? అతని మొహం చూడటమే అసహ్యంగా ఉంటే... రోజూ చూడాలా...? పైగా అతని సంజాయిషీ ఏమిటంటే... 'కట్నం తెమ్మని వేధించటం అంతా ఒట్టిదేనట. నామీద నున్న ఇష్టంతోనే... అలా ప్రవర్తించానని చెప్పటం!' అదెంత రోతగా అనిపిస్తుందో అతనికి తెలియకపోవటమే నాకు మరీ విచిత్రమనిపించింది.

'ఇక కట్నం ప్రసక్తి అనేది నిజంగానే ఉండదని గట్టిగా చెప్పగలడట!'

నాకు కొంచెం నవ్వొచ్చింది... ఎంతటి ఔదార్యం!

ఇద్దరి కూతుళ్ళ జీవితాలూ తనకే దఖలు పడితే, అమ్మా నాన్నలు సంపాదించిన కొద్దో గొప్పో ఆస్తి అంతా అతనికేగా చెందుతుందీ....?! ఎంత తెలివితేటలు చూపిస్తున్నాడూ అనుకున్నాను!

చెప్పటం ఆపిన సీత ఒక క్షణం నిశ్శబ్దంగా ఉండిపోయింది.

గోదారమ్మ ఆశ్చర్యం నిండిన గొంతుతో ''అయితే సీతా... రంగా నీ బిడ్డకాదా... మీ అక్క కొడుకా...?!'' అనడిగింది.

అవునన్నట్లుగా తలవూపిన సీత ఆవిడ చెయ్యి పట్టుకుని ''అమ్మా... ఒక్కమాట. వాడు... మా అక్క కొడుకనే విషయం మీరు ఎవరికీ చెప్పకండి. ఇది నా అభ్యర్థన! రంగాకీ, ఆఖరుకి వర్మకీ కూడా!'' అంది.

ఆవిడ నిట్టూరుస్తూ ''ఈ సంగతి మనమధ్యనే ఉంటుంది. అదిసరేగానీ, సీతా... వర్మకి రంగా గురించి ఏ అభ్యంతరం లేకపోతే, నీకూ అంతేగా...?'' అనడిగింది.

సీతా నిట్టూర్చింది.

''ఏమోనమ్మా... నాకు పెళ్ళి పట్ల బాగా విరక్తి ఏర్పడిపోయింది. ఏ మగవాడిని చూసినా... విశాల్రావు లాంటి వ్యక్తి అంశ కొంచమైనా ఉంటుందనే అభిప్రాయం ఏర్పడిపోయింది. ముందు సుముఖత చూపించినా, తర్వాతయినా వాళ్ళకి రంగా పట్ల అయిష్టం ఏర్పడుతుందేమోనని నాకో భయం కూడా ఉంది...!''

గోదావరమ్మ వెంటనే అంది ''నిజమే సీతా... నీ కథంతా విన్నాక, నీ భయం సహజమేనని అనిపిస్తుంది ఎవరికైనా! అయితే... ఇక్కడ నేనో మాట నమ్మకంగా చెప్పగలను! రామచంద్ర కూడా నీలాంటివాడే. అందులో మాత్రం నాకేం సందేహం లేదు! అతనికీ... నీలాగే చాలా సంబంధాలు వచ్చి... కుముద బాధ్యత తనదేనని వాళ్ళకి అతను చెప్పటం వలన వెనక్కి వెళ్ళిపోయాయని విన్నాను.

అంటే... చూడు... అతనూ నీలాగే నిస్వార్థంగా ఆలోచించి అన్నా వదినల పిల్ల బాధ్యతను స్వీకరించి... తన సుఖాన్ని, పెళ్ళిని వదిలేసుకోగలిగాడు! నువ్వు... అందరి మగవాళ్ళనీ ఒకే దృష్టితో చూడటం తప్పని చెప్పటానికే ఇదంతా చెబుతున్నాను. విశాల్రావులాంటి వాళ్ళు ఉన్నారు... రామచంద్రవర్మ లాంటి వాళ్ళూ ఉన్నారు. అందర్నీ ఒకే గాటన కట్టటం సబబేనంటావా... మనకో సామెత కూడా ఉంది... వినే ఉంటావు... గుర్రాన్నీ, గాడిదనీ ఒకే గాటన కట్టడం సరికాదని!''

సీత ఆవిడ మాటలకు సమాధానం ఏమీ చెప్పకుండా మౌనంగా తలవంచుకుంది. మళ్ళీ గోదావరమ్మే అంది ''సీతా... తొందరేం లేదు... నా అభిప్రాయాన్ని నీ మనసులో పెట్టుకుని ఆలోచించు. అయితే రామచంద్ర దగ్గర ఈ విషయం నేనింకా ప్రస్తావించలేదు. ముందుగా నీ అభిప్రాయమే తెలుసుకోవాలనుకున్నా..మీరిద్దరూ ఒకే దారిలో ప్రయాణిస్తున్నారు. ఒక బంధం ఏర్పరుచుకుని... అదే ధ్యేయంగా మార్చుకున్నారు! పెళ్ళి అనే బంధంతో మీరిద్దరూ ఒకరికొకరు తోడై పిల్లలతో ఒక కుటుంబంలా

మారితే.... మీ జీవితం ఇంకా బావుంటుందనిపించి ఈ ప్రతిపాదన తెచ్చాను!'' అంటూ సీత మొహంలోకి పరిశీలనగా చూసింది గోదారమ్మ. అయితే సీత మొహంలో ఆవిడ ఆశించిన మార్పు లేకపోగా....ఇంకా అలా గుంభనంగా వుండిపోవటంతో...ఆవిడ నిరాశ చెందినట్టుగా మౌనంగా వుండిపోయింది.

ఒక వారం తర్వాత....

ఆ సాయంకాలం...సీత గోదావరమ్మ దగ్గరకు వచ్చి కూర్చుంది. ఏదో అడగాలనుకుంటూ సంశయిస్తూ ఉందని ఆవిడకు అనిపించి ''ఏమిటమ్మా సీతా... అలా తటపటాయిస్తున్నావెందుకూ... అడగాలనుకున్నది అడుగూ..'' అంది చిరునవ్వుతో.

''అమ్మా... ఏం లేదూ...'' అంటూ ఒక క్షణం ఆగి, సీత అంది ''వర్మగారు ఎందుకనో ఈ మధ్య నాతో ముభావంగా ఉంటున్నారనిపించింది. నన్ను చూస్తూనే... దూరం జరుగుతున్నట్లుగా అనిపిస్తోంది... కారణం ఏమై ఉంటుందా అని....'' సగంలోనే మాటల ఆపేసింది సీత.

గోదావరమ్మ నిట్టూర్చింది. ''అదా...నేనే చెప్పాలే....'' అనగానే సీత కళ్ళు పెద్దవి చేసి ఆవిడవైపు ఆశ్చర్యంగా చూసింది.

''ఏం... చెప్పారమ్మా...?'' అంటూ ఆరాతీసింది.

''సీతకు... కొన్ని జీవితానుభవాలవల్ల మగవాళ్ళపై సదభిప్రాయం పోయిందీ... అని చెప్పాను. అది నిజమేగా ! కానీ దానికతను ఏం జవాబు చెప్పాడో తెలుసునా...?''

గోదారమ్మ మాటలకు సీత చాలా ఆసక్తిగా ఏం చెప్పారన్నట్లుగా చూసింది.